సాక్షి అనకాపల్లి

ఆదివారం । 13 । ఆగస్టు । 2023



గడపగడపకు ముగింపు సభ

చోడవరంలో ఆదివారం జరిగే గడపగడపకు మన ప్రభుత్వం ముగింపు సభలో రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పాల్గొంటారు. 8లో



దశాబ్దాల కల నెరవేరిన వేళ..

రూ.1.90 కోట్ల వీఎంఆర్‌డీఏ నిధులతో చేపట్టే పాయకరావుపేట మెయిన్‌రోడ్డు పనులకు శనివారం భూమి పూజ చేశారు. 8లో



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: ఏకాదశి పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి.

న్యూస్‌రీల్

కేజీహెచ్‌లో అభివృద్ధి పనుల పరిశీలన


మహారాణిపేట (విశాఖ): కేజీహెచ్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున శనివారం పరిశీలించారు. కేజీహెచ్‌లో అత్యవసర చికిత్స విభాగంలో ఆధునికీకరణ పనులు, క్లినికల్ ల్యాబ్, ప్రధాన ద్వారం వద్ద నిర్మిస్తున్న ఆర్చ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర చికిత్స విభాగం విస్తరణ పనులను రూ.30 లక్షలతో చేపడుతున్నట్లు తెలిపారు. అదే విధంగా 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా అత్యవసర క్లినికల్ ల్యాబ్ రూ.15 లక్షలతో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాయుడు, డీఈ మన్మథరావు, ఏడీ శ్రీనివాస కుమార్, వివిధ విభాగాధిపతులు, వైద్యులు పాల్గొన్నారు.

దువ్వాడ స్టేషన్ వార్షిక ఆదాయం రూ.32.39 కోట్లు



అగనంపూడి: వివిధ మార్గాల ద్వారా దువ్వాడ రైల్వేస్టేషన్ ఆర్జించిన ఆదాయాన్ని రైల్వేశాఖ అధికారులు వెల్లడించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.32,39,76,980 ఆదాయం ఆర్జించి.. వాల్తేర్ డివిజన్‌లో 13వ స్థానంలో నిలిచిందని తెలిపారు. 2020–21లో రూ.21 కోట్ల ఆదాయం ఉండగా.. రెండేళ్లలో పది కోట్లకు పైగా ఆదాయం పెరగడంపై దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కాగా.. విశాఖ రైల్వేస్టేషన్ రూ.679 కోట్ల ఆదాయంతో టాప్‌లో ఉంది.

నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఆచార్య సుధాకర్



ఏయూక్యాంపస్: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ఏయూ హ్యూమన్ జెనిటిక్స్ విభాగం ఆచార్యులు జి.సుధాకర్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డికి లేఖ రాశారు. పాలక మండలిలో దీనికి సంబంధించిన అనుమతి తీసుకుని నిరభ్యంతర పత్రం జారీ చేయాలని కోరారు. దీనిపై ఆచార్య సుధాకర్‌ని సంప్రదించగా ఏయూ అధికారులు దీనికి సంబంధించిన ప్రక్రియ జరుపుతున్నారని, ఉత్తర్వులు అందిన వెంటనే పదవీ బాధ్యతలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ప్రగతి మార్గాలు.. గ్రామీణ రహదారులు

- పీఎంజీఎస్‌వై ఫేజ్ –3 లో రూ.52 కోట్లతో 12 రోడ్లు
- వీటిలో 11 నిర్మాణాలు పూర్తి.. పురోగతిలో మరో రోడ్డు
- అత్యధికంగా అనకాపల్లి జిల్లాకే మంజూరు
- నూతనంగా 4 కల్వర్టులు.. మాడుగుల రోడ్డుకు రూ.12 కోట్లు మంజూరు



కన్నంపేట నుంచి పాములవాకకు నిర్మించిన రోడ్డు



కూసర్లపూడి నుంచి రోలుగుంట వెళ్లే రోడ్డు

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో సంక్షేమంతోపాటే అభివృద్ధి కూడా సమాంతరంగా పరుగులు పెడుతోంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పల్లెల్లో రోడ్ల నిర్మాణాలు జరగలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గ్రామాల్లో మునుపెన్నడూ లేనివిధంగా రహదారులు నిర్మిస్తున్నారు. జిల్లాలో మారుమూల గ్రామాలకు కూడా నూతన రోడ్డు నిర్మాణాలు చేపట్టారు. ఒకవైపు రోడ్లు భవనాల శాఖ, ఇంకోవైపు పంచాయతీరాజ్ శాఖ రోడ్లు నిర్మిస్తున్నాయి. మరోవైపు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖతో సంయుక్తంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రగతి మార్గాలను నిర్మిస్తోంది. రాష్ట్ర గ్రామీణ రహదారుల అభివృద్ధికి వరుసగా నాలుగో ఏడాదీ కేంద్రం నుంచి రికార్డు స్థాయి నిధులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాధించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తితో చేపడుతున్న ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) ఫేజ్ -3లో జిల్లాలో 12 రోడ్లు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటికే 11 పూర్తవ్వగా.. మరొకటి పురోగతిలో ఉంది. ఈ పథకంలో మిగతా జిల్లాలకన్నా అనకాపల్లికే ఎక్కువ రోడ్లు మంజూరయ్యాయి.. వీటిలో 7 రోడ్లను ప్రారంభించారు కూడా.. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లు మునుపెన్నడూ లేనంత వేగంగా అభివృద్ధి చెందాయి.

ఎంపీ చొరవతో ముందడుగు

నూతనంగా ఏర్పాటైన గ్రామీణ జిల్లా అభివృద్ధిలో ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి కృషి కూడా ఉంది. నిరంతరం స్థానిక సమస్యలను సీఎం వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళుతూ.. నిధులు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. అదేవిధంగా కేంద్రం దృష్టికి తీసుకెళ్లి.. నిధులు సాధించి జిల్లా అభివృద్ధికి దోహదపడుతున్నారు. గతంలో పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీ సత్యవతి పలుమార్లు రోడ్ల నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. ఇటీవల జిల్లాకు రూ.12 కోట్లతో ఒక రోడ్డు, మరో నాలుగు బ్రిడ్జిలు మంజూరు చేశారు. వీటిలో వెదురుపర్తి, పెదపాడు, మునగపాకలో మూడు, అనకాపల్లి–అచ్యుతాపురం రోడ్‌లో ఒక కల్వర్టు నిర్మాణం ఉన్నాయి.

నాలుగు కల్వర్ట్ బ్రిడ్జిలు

మాడుగుల రోడ్డుతోపాటు నాలుగు కల్వర్టు బ్రిడ్జిలకు రూ.12 కోట్లు మంజూరయ్యాయని పీఎంజీఎస్‌వై ప్రాజెక్టు డీఈ శ్రీనివాస్ తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

అడిగిన అన్నింటికీ నిధులు మంజూరు



జిల్లాలో గ్రామీణ ప్రాంతం ఎక్కువగా ఉంది. గత పదేళ్లుగా రోడ్డు నిర్మాణాలు చేపట్టకపోవడంతో గుంతలు పడ్డాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో పెద్ద ఎత్తున రోడ్లు నిర్మిస్తున్నాం. కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి పీఎంజీఎస్‌వై ఫేజ్–3లో అన్ని జిల్లాల కన్నా అత్యధికంగా అనకాపల్లి జిల్లాకే నిధులు మంజూరయ్యాయి. 4 కల్వర్టులు, ఒక రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించారు. అదేవిధంగా మరో రెండు రోడ్డు నిర్మాణాలకు కూడా ప్రతిపాదనలు పంపించాం.

–డాక్టర్ బి.వి.సత్యవతి, అనకాపల్లి ఎంపీ

జిల్లాలో పూర్తయిన పీఎంజీఎస్‌వై రహదారులు ఇవే..

మొత్తం జిల్లాలో రూ. 52 కోట్లతో 12 రోడ్లు మంజూరయ్యాయి. వీటిలో 11 రోడ్లు పూర్తయ్యాయి. మరొకటి పురోగతిలో ఉంది. వీటిలో ప్రధానమైనవి..

- రూ.7 కోట్లతో 11.2 కిలోమీటర్ల మేర రోలుగుంట మండలంలో కొవ్వూరు–బుచ్చింపేటకు నాయుడుపాలెం, నిండుగొండ, ఎన్.కొత్తూరు, మునిపల్లి మీదుగా రోడ్డు నిర్మాణం చేపట్టారు.
- రూ.3.15 కోట్లతో 8.4 కిలోమీటర్ల మేర కె.కోటపాడు నుంచి పినగాడి రోడ్డు వయా సబ్బవరం మండలంలో గల టిక్కలిపాలెం, నయనంపాలెం, వంగలి, ఒమ్మివానిపాలెం నిర్మిస్తున్నారు.
- రూ.5 కోట్లతో 7.7 కిలోమీటర్ల మేర పాయకరావుపేట మండలంలో గల పాల్తేరు నుంచి తుని వయా పెంటకోట రోడ్డు
- రూ. 4 కోట్లతో 5.2 కిలోమీటర్ల మేర పరవాడ నుంచి ఎన్‌హెచ్–5 రోడ్డు వయా తానం, దోప్పవానిపాలెం, తాడి రోడ్డు
- రూ.5 కోట్లతో 5.7 కిలోమీటర్ల మేర కోటవురట్ల మండలంలో కన్నంపేట నుంచి పాములవాక వయా ఉప్పరగూడెం, సూర్యపురం రోడ్డు
- రూ.5 కోట్లతో 6.3 కిలోమీటర్ల మేర మాకవరపాలెం మండలంలో కుసర్లపూడి నుంచి రోలుగుంట రోడ్డు వయా కె.కోటపాడు, తడపాల, బూరుగుపాలెం, పాపాయ్యపాలెం రోడ్డు
- రూ.6 కోట్లతో 8.5 కిలోమీటర్ల మేర అనకాపల్లి పీఎంకే రోడ్డు నుంచి కశింకోట మండలం వెదురుపర్తి బ్రిడ్జి వరకు వయా మునగపాక, పెదపాడు రోడ్డు
- రూ. 3 కోట్లతో 4.4 కిలోమీటర్ల మేర తుమ్మపాల నుంచి కేబీ రోడ్డు వయా వెంకుపాలెం, సుందరయ్యపేట, అచ్చయ్యపేట
- రూ.4.4 కోట్లతో 7.7 కిలోమీటర్ల మేర రాజం నుంచి తట్టబండ రోడ్డు
- రూ. 4.6 కోట్లతో 6.8 కిలోమీటర్ల మేర చౌడవాడ నుంచి జీజే పురం రోడ్డు

అథ్లెట్ జ్యోతికి రూ.లక్ష ప్రోత్సాహకం

విశాఖ స్పోర్ట్స్: ఏపీ అథ్లెటిక్ వార్షిక జనరల్ బాడీ సమావేశం శనివారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగింది. అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతున్న విశాఖ అథ్లెట్ జ్యోతి తల్లిదండ్రులకు ఈ సందర్భంగా రూ.లక్ష ప్రోత్సాహకంగా అందించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అథ్లెట్లను తయారు చేసుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. అన్ని జిల్లాల్లో అథ్లెటిక్ ట్రాక్స్ ఏర్పాటు చేసుకోవాలని, జూనియర్లతో పాటు సౌత్‌జోన్ మీట్ నిర్వహించాలన్నారు. జ్యోతి తండ్రి సెక్యూరిటీ గార్డ్‌గానే ఉంటూ.. కుమార్తె అంతర్జాతీయ అథ్లెట్‌గా మారేందుకు ప్రోత్సహించారన్నారు. సెప్టెంబర్‌లో అథ్లెటిక్స్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి పలు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. కాగా.. సెప్టెంబర్‌లో నేషనల్ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్, సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్, ఇండియన్ ఓపెన్ అండర్–23 అథ్లెటిక్ చాంపియన్‌షిప్, నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ జరగనున్నాయి. నవంబర్‌లో ఏపీ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ జరగనుండగా ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్, నేషనల్ అంతర జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లకు వేదికలు, తేదీలు ఖరారు కావల్సి ఉంది.

నేడు ఏపీఎల్ 3కే రన్

విశాఖ స్పోర్ట్స్: ఏసీఏ ఆధ్వర్యంలో ఆదివారం 3కే రన్ నిర్వహించనున్నట్లు ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథరెడ్డి తెలిపారు. ఈనెల 16 నుంచి విశాఖలో ప్రారంభం కానున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్ సందర్భంగా ఈ రన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాగర తీరంలో కాళీమాత ఆలయం నుంచి ఉదయం 6 గంటలకు ఈ పరుగు ప్రారంభం కానుందన్నారు. మన ఆంధ్ర మన ఏపీఎల్ పేరిట నిర్వహించనున్న ఈ పరుగు ప్రారంభ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమవర్మ, మేయర్ జి.హరివెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి, క్రికెటర్ కె.ఎస్.భరత్, రంజీ క్రీడాకారులు పాల్గొనున్నారు.

మది మదిలో దేశభక్తి



మది నిండా దేశభక్తి ఉప్పొంగగా.. మువ్వన్నెల జెండాలు రెపరెపలాడగా.. విద్యార్థుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. 76వ స్వాతంత్య్ర దినోత్సవాలను కె.కోటపాడులోని ఒక విద్యా సంస్థలో ముందస్తుగా శనివారం నిర్వహించారు. భారీ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించడంతోపాటు జాతీయ జెండాలను చేతబూని విద్యార్థులు కదం తొక్కారు. పాఠశాల మైదానంలో భారత్ మాతాకీ జై, మేరా భారత్ మహాన్, వందేమాతం అంటూ నినాదాలు చేశారు.

-కె.కోటపాడు

థ్యాంక్యూ సీఎం సార్



తారువ క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఎఫ్‌టీఈ ఉద్యోగులు

- వేతనాల పెంపుపై సెర్ప్ ఎఫ్‌టీఈ ఉద్యోగుల హర్షాతిరేకాలు

దేవరాపల్లి: వేతనాలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసి, తమ జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి తామంతా జీవితాంతం రుణపడి ఉంటామని సెర్ప్ ఎఫ్‌టీఈ ఉద్యోగులు తెలిపారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) పరిధిలో పనిచేస్తున్న ఫిక్సెడ్ టెన్యూర్ ఎంప్లాయిస్(ఎఫ్‌టీఈ) సిబ్బందికి వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు తారువలో డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు సమక్షంలో శనివారం రాత్రి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా ఎఫ్‌టీఈ ఉద్యోగుల సంఘం కన్వీనర్ ఎస్. శ్రీనివాసరావు. డీపీఎం ఎస్.ఎస్. రత్నప్రభ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే



చింతలపాలెం సచివాలయంలో ఇంటింటి ఓటరు సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్



నెహ్రూనగర్ సచివాలయంలో బీఎల్‌వోలతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కశింకోట/యలమంచిలి: ఓటర్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, తప్పులు లేకుండా జాబితా తయారు చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. కశింకోట, యలమంచిలి మండలాల్లో శనివారం ఆయన పర్యటించారు. కశింకోట మండలం చింతలపాలెం సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటి ఓటర్ల సర్వే తీరును పరిశీలించారు. యలమంచిలి మున్సిపాలిటీ నెహ్రూ నగర్ సచివాలయంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. సర్వేలో ఎక్కడా తప్పులు దొర్లకూడదని సూచించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. మృతి చెందిన ఓటర్ల పేర్లను తొలగించేటప్పుడు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. సర్వేలో గ్రామ వలంటీర్ల ప్రమేయం ఉండరాదని తెలిపారు. నిర్దేశిత బీఎల్‌వోలు, అధికారులు సర్వే నిర్వహించాలని స్పష్టం చేశారు. చింతపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ జి. సత్యనారాయణ, ఉప తహసీల్దార్ సురేష్‌నాయుడు పాల్గొన్నారు. నెహ్రూనగర్ సచివాలయంలో జరిగిన సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి, తహసీల్దార్ రాణీ అమ్మాజి, సచివాలయ సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలిగొట్లలో ఆలయ హుండీ చోరీ


తాళాలు పగలుకొట్టి చోరీ చేసిన హుండీ ఇదే..

దేవరాపల్లి: మండలంలోని కలిగొట్ల గ్రామ దేవత పైడిమాంబ ఆలయ హుండీని గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి చోరీ చేశారు. ఆలయ ఆవరణ బయట ఏర్పాటు చేసిన హుండీ తాళాలు పగులగొట్టి అందులోని నగదును ఎత్తుకుపోయారు. కలిగొట్లకు చెందిన బొడ్డు పాలవెల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. నాగేంద్ర శనివారం తెలిపారు. చోరీకి గురైన హుండీలో రూ.15 వేల వరకు నగదు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలోనూ ఈ ఆలయ హుండీని చోరీ చేయడం విశేషం.

విద్యుదాఘాతానికి గురై కూలీ మృతి


మృతి చెందిన రామునాయుడు

చోడవరం రూరల్: మండలంలోని గోవాడ గ్రామానికి చెందిన ఏడువాక బంగారునాయుడు(46) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. గ్రామంలో శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ బి. శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. బంగారునాయుడు కూలీ పని చేసుకుని ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో కళ్లు తిరిగి పడిపోయాడు. ఆ సమయంలో అనుకోకుండా పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన స్తంభానికి చేయి తాకడంతో షాక్‌కు గురయ్యాడు. అది చూసిన స్థానికులు అతడిని చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవపరిచారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు చోడవరం సుగర్ ఫ్యాక్టరీలో సీజనల్ ఉద్యోగి. అతని కుమారుడు షణ్ముఖసాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

దశాబ్దాల కల నెరవేరిన వేళ...

- పాయకరావుపేట మెయిన్‌రోడ్డు పనులకు భూమిపూజ
- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల, ఎమ్మెల్యే బాబూరావు, ఎంపీ సత్యవతి

పాయకరావుపేట: నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. పాయకరావుపేటలో శిథిలావస్థకు చేరి, గోతులమయమైన మెయిన్‌రోడ్డును పునః నిర్మించే పనులకు శనివారం స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల భూమి పూజ చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి తుని-పాయకరావుపేట వెళ్లేందుకు ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఈ రోడ్డు శిథిలమైంది. స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చొరవతో రోడ్డు నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ రూ.1.90 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో పాత ఎన్‌హెచ్ 5 నుంచి గౌతం సినిమా హాలు వరకు 2 కిలోమీటర్ల పొడవున కొత్త రోడ్డు నిర్మించనున్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో సుమారు రూ.3 కోట్లు మంజూరు చేశారు. అయితే కాంట్రాక్టర్ కొద్దిమేర పనులు చేసి వదిలేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అంచనాలను రూ.4 కోట్లకు పెంచి ఈ పనులను వీఎంఆర్‌డీఏకు అప్పగించింది. అయితే పనులు ప్రారంభించలేదు. ఈలోగా అధికారం కోల్పోయింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ రోడ్డు విస్తరణకు రూ.6 కోట్లు కేటాయించింది. రోడ్డును విస్తరిస్తే ఇరువైపులా వ్యాపారాలు చేసుకునే తామంతా ఉపాధి కోల్పోతామని, తమకు ఉపాధి కల్పించిన తర్వాతే విస్తరణ చేపట్టాలంటూ టీడీపీకి చెందిన కొంతమంది చిరువ్యాపారులు కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతానికి రోడ్డు విస్తరణ పనులు పెండింగ్‌లో పెట్టి గౌతం సెంటర్ నుంచి బైపాస్ వరకు కొత్త రోడ్డు నిర్మించేందుకు వీఎంఆర్‌డీఏ నుంచి రూ.1.90 కోట్లు మంజూరు చేయించారు. కోర్టు వ్యవహారం తేలిన తర్వాత చిరువ్యాపారులకు ఉపాధి కల్పించి, రోడ్డు విస్తరణ చేపట్టాలని నిర్ణయించారు. యథావిధిగా రోడ్డు నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల మాట్లాడుతూ పాయకరావుపేట మెయిన్‌రోడ్డు దుస్థితిని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తన దృష్టికి పలుమార్లు తీసుకువచ్చారన్నారు. దీంతో నిధులు మంజూరు చేశామని చెప్పారు. ఇక్కడ డ్రైనేజీని కూడా నిర్మించాలని కోరారని, అది కూడా నెరవేరుస్తానన్నారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ ప్రతిపక్షాలు సహకరించకపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. పాయకరావుపేట మెయిన్‌రోడ్డును త్వరలోనే ఎంపీ, సీఎస్ఆర్ నిధులతో డబుల్‌రోడ్డుగా విస్తరిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే బాబూరావు మాట్లాడుతూ రోడ్డు పనులు పూర్తయితే ప్రగతి పరుగులు పెడుతుందన్నారు. రాజకీయం చేయాలని ప్రతిపక్షాలు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. రోడ్డు విస్తరణలో ఏ ఒక్కరికీ ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, సర్పంచ్ గారా ఉషశ్రీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు దనిశెట్టి బాబూరావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గూటూరు శ్రీను, వైస్ ఎంపీపీలు డి.మాధవి, పల్లేల స్వామి, వీఎంఆర్‌డీఏ ఎస్ఈ భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అనితను అడ్డుకున్న పోలీసులు

నక్కపల్లి: పాయకరావుపేట మెయిన్ రోడ్డు శంకుస్థాపన పనులు అడ్డుకుంటారన్న సమాచారంతో టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనితను శనివారం పోలీసులు వేంపాడు టోల్‌ప్లాజా వద్ద అడ్డుకున్నారు. పాయకరావుపేటలో అభివృద్ధి కార్యక్రమం జరుగుతోందని, అడ్డుకుంటారనే సమాచారం రావడంతో ముందు జాగ్రత్త చర్యగా నిలువరించామని పోలీసులు ఆమెకు వివరించారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత ఆమెను అనుమతించారు. తానే రోడ్డు విస్తరణకు రూ.6 కోట్లు మంజూరు చేయించానని, తనను అడ్డుకోవడం తగదని అనిత వాదించారు. అయితే అప్పుడు ఎందుకు రోడ్డు నిర్మించలేదని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నేడు గడపగడపకు ముగింపు బహిరంగ సభ


చోడవరం బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

- హాజరు కానున్న పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు
- తరలి రానున్న వేలాది మంది జనం, పార్టీ శ్రేణులు
- చోడవరంలో భారీ స్థాయిలో ఏర్పాట్లు పూర్తి
- పర్యవేక్షించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: గడపగడపకు మన ప్రభుత్వం ముగింపు బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జరిగే బహిరంగం సభకు చోడవరం గవర్నమెంటు హైస్కూల్ గ్రౌండ్‌ను ముస్తాబు చేశారు. ఈ సభకు నియోజకవర్గం నలుమూలల నుంచి 20 వేల మందికిపైగా హాజరయ్యే అవకాశం ఉండటంతో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశారు. ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితోపాటు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొననుండటంతో వేదిక ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా సిద్ధం చేశారు.

దారిపొడవునా భారీ ఫ్లెక్సీలు, కటౌట్లు..

చోడవరం పట్టణంలో మెయిన్ రోడ్డుతోపాటు అడ్డూరు నుంచి వెంకన్నపాలెం, గోవాడ, అంబేరుపురం, గజపతినగరం, గాంధీ గ్రామం, నర్సయ్యపేట, గ్రామాలను కలుపుతూ దారి పొడవునా భారీ ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు. బహిరంగ సభ అనంతరం దూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం రెండు ప్రదేశాల్లో భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో జరిగే ఈ సభను ఆయన దగ్గర ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. నియోజకవర్గంలో రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట, చోడవరం మండలాల పరిధిలో 160 గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ అభిమానులు, మహిళలు ఈ సభకు వివిధ వాహనాలపై వస్తుండటంతో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టారు. చోడవరం పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణానికి కొద్దిపాటి దూరంలో పార్కింగ్ స్థలాలు కేటాయించారు. ఈ సందర్భంగా విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ ముగింపు సభను చోడవరంలో భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని కోరారు.

గంజాయి తరలిస్తున్న ఐదుగురి అరెస్టు

- కారు, 6 కేజీల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు సీజ్
- పట్టుబడిన వారిలో బాలుడ్ని జువైనల్ కోర్టుకు తరలింపు
- నిందితులంతా ప్రకాశం జిల్లా వాసులు


దేవరాపల్లి పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన గంజాయి, కారుతో ఎస్ఐ నాగేంద్ర

దేవరాపల్లి: కారులో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ప్రకాశం జిల్లాకు చెందిన ఐదుగురు యువకులను దేవరాపల్లి పోలీసులు శనివారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించి ఎస్ఐ డి. నాగేంద్ర తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం నెలతూరు గ్రామానికి చెందిన వడ్డెల వాసు, వడ్డెల అనిల్, వడ్డెల పెదబాబు, రావూరి పవన్‌తోపాటు బాలుడు(17) కారులో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మన్యానికి వెళ్లారు. అక్కడ ఆరు కేజీల గంజాయి కొనుగోలు చేసి పినకోట, దేవరాపల్లి మీదుగా ప్రకాశం జిల్లాకు పయనమయ్యారు. ఈ క్రమంలో శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో గంజాయి తరలిస్తున్న ఐదుగురు యువకులు పట్టుబడ్డారు. వీరిని అదుపులోకి తీసుకొని కారును తనిఖీ చేయగా ఆరు కేజీల గంజాయి లభ్యమైంది. కారును, గంజాయిని, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను చోడవరం కోర్టులో హాజరు పరిచామని ఎస్ఐ తెలిపారు. బాలుడ్ని జువైనల్ కోర్టుకు తరలించామన్నారు.

9 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

చీడికాడ: ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 9 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై పి.రామారావు శనివారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని అప్పలరాజుపురం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన సింబల్స్ రాజయ్యగం, కార్లమార్క్స్, కుమార్ రాజేంద్రన్ తమ లగేజీ బ్యాగులతో పరారయ్యేందుకు ప్రయత్నించగా పట్టుకున్నామన్నారు. వారిని విచారించి ఒక్కొక్క బ్యాగులో మూడు కిలోల చొప్పున గంజాయి పట్టుబడిందన్నారు. గంజాయితోపాటు ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు ఒడిశా నుంచి తమిళనాడుకు గంజాయి తీసుకెళ్తున్నట్లు విచారణలో తేలిందన్నారు.

అట్రాసిటీ కేసు విచారణ


బాధితుని పొలంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

చీడికాడ: కోనాం శివారు గుంటి గ్రామంలో అట్రాసిటీ కేసును డీఎస్పీ సుబ్బరాజు శనివారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన కోట పెదదేముడు తన పొలంలో వరినారును కొంత మంది నాశనం చేయడమేగాక కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేశాడు. ఎస్సై పి.రామారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు సంపతిపురంలో గడప గడపకు మనప్రభుత్వం

అనకాపల్లిటౌన్: మండలంలోని సంపతిపురంలో ఆదివారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మనప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొనున్నట్టు పేర్కొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

అనకాపల్లిటౌన్: స్థానిక రింగ్‌రోడ్డు గీతా ప్రైవేటు ఆస్పత్రిలో వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ఆర్థోపెడిక్ వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు యల్లపు శివ శనివారం తెలిపారు. డాక్టర్ వి.సంపత్ వైద్యపరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న చినబ్బాయి

అనకాపల్లిటౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ప్యాప్టో చైర్మన్ చినబ్బాయి కోరారు. స్థానిక నెహ్రూచౌక్‌లో ప్యాప్టో ఆధ్వర్యంలో శనివారం నిరసనదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై ప్రభుత్వం తక్షణం స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ కార్యదర్శి ఎస్.సన్యాసినాయుడు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాలకలపాటి రఘువర్మ, ప్యాప్టో కార్యవర్గ సభ్యులు మధు, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, ఉపాధ్యాయులు సీహెచ్.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, గణేష్, వై.శ్రీనివాసరావు, జోగా రాజేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్తి పాటల కచేరీ



భక్తిగీతాలు ఆలపిస్తున్న విష్ణుమూర్తి

అనకాపల్లిటౌన్: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వివేకానంద కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించి భక్తి పాటల కచేరీ ఆకట్టుకుంది. అధిక శ్రావణమాసంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించి ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ కె.విష్ణుమూర్తి పలు భక్తి గీతాలు ఆలపించారు. కళా పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	:	రాజా
భోళాశంకర్	:	సత్యనారాయణ స్క్రీన్-1
ఉస్తాద్	:	సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	:	షిర్డిసాయి
భోళాశంకర్	:	పర్తిసాయి
భోళాశంకర్	:	వెంకటేశ్వర
భోళాశంకర్	:	శ్రీసత్య
బ్రో	:	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 58 బెల్లం దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	-----	-----
రెండో రకం	3,850	3,900
మూడోరకం	3,500	3,800

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 29 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-2 యూనిట్లు, బి పాజిటివ్-10 యూనిట్లు, ఒ పాజిటివ్ 16 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(ఫోన్ నంబర్ 9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 476 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 409 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

తడారిన మడులు.. గుండెల్లో సుడులు

- ఎండుతున్న నారు
- వర్షాల కోసం రైతుల ఎదురుచూపులు



గొల్లగాంలో ఎండిపోతున్న వరినారు

తుమ్మపాల: చినుకు రాలదు.. చింత తీరదు అన్నట్టుగా రైతుల పరిస్థితి ఉంది. వానల కోసం అన్నదాతలు ఆకాశానికేసి దీనంగా చూస్తున్నారు. నారు మడులు ఎండుతుండడంతో దిగులు చెందుతున్నారు. ఈ సారి వర్షాలు బాగానే కురుస్తాయన్నట్టుగా వాతావరణంలో మార్పులు కన్పించినా చినుకు రాలక రైతుల్లో నిరాశే మిగిలింది. వరుణుడు కరుణించకపోడంతో మండలంలోని 32గ్రామాల్లో 25 గ్రామాల్లో ఇప్పటికీ ఉడుపులు జరగలేదు. మొత్తం వరి విస్తీర్ణం 7,284 ఎకరాలు కాగా కేవలం 1,400 ఎకరాల్లో మాత్రమే ఉడుపులు జరిగాయి. గత ఏడాది ఇదే నెలలో ఉడుపులు పూర్తయ్యాయి.

మండలంలో మెట్టప్రాంతాల్లోని చెరువుల్లో నీటి నిల్వలు లేకుండా పోయాయి. కొడూరు, కొండుపాలెం, మాకవరం, సీహెచ్.ఎన్.అగ్రహారం, రేబాక, గొలగాం, గోపాలపురం, అక్కిరెడ్డిపాలెం, మారేడుపూడి గ్రామాల్లో చెరువుల్లో నీరు అడుగంటింది. ఆయా చెరువుల కింద ఉన్న భూముల్లో రైతులు వరిపండిస్తుంటారు. అనుకున్నస్థాయిలో వర్షాలు కురవకపోవడంతో చెరువుల్లోకి నీరు చేరక నారుమడులు ఎండిపోయే దశకు చేరుకున్నాయి.

ఐదు గ్రామాల్లో పూర్తయిన ఉడుపులు

శారదానది పరివాహక ప్రాంతాల్లో ఇప్పటికే ఉడుపులు మొదలయ్యాయి. తుమ్మపాల, వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, మార్టూరు గ్రామాల్లో చెరువుల కింద వరిసాగు విస్తారంగా జరుగుతుంది. ఆయా గ్రామాల్లో చెరువుల్లో పుష్కలంగా నీరు చేరడంతో రైతులు ఉడుపులు పూర్తిచేశారు.

ఎండిపోయే దశకు నాట్లు



ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో వరినాట్లు ఎండిపోయేదశకు చేరుకున్నాయి. చెరువుల్లో కూడా నీరుచేరకపోవడంతో వర్షాలకోసం ఎదురుచూస్తున్నాం. గత ఏడాది ఈ సమయానికి మాపొలంలో ఉడుపులు పూర్తి చేశాను.

– సుంకర అప్పారావు, రైతు, రేబాక

రైతులు భయపడాల్సిన పని లేదు



త్వరలో వర్షాలు సమృద్ధిగా పడతాయి. ఈ విషయంలో రైతులు భయపడాల్సిన పనిలేదు. శారదానది పరివాహక ప్రాంతాల్లో ఇప్పటికే ఉడుపులు ప్రారంభమయ్యాయి. మరి కొన్ని ప్రాంతాల్లో ఉడుపులు ప్రారంభించాల్సి ఉంది.

–రంగాచారి, ఏవో, అనకాపల్లి

జగన్ పాలనపై ప్రజల్లో పూర్తిస్థాయి సంతృప్తి

- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని, జగన్‌పాలనపై జనం పూర్తి సంతృప్తితో ఉన్నారని రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఎంతకాలం అధికారంలో ఉన్నామన్నది ముఖ్యం కాదని పదవిలో ఉన్న సమయంలో ప్రజలకు ఏం మేలు చేశామో ముఖ్యమని చెప్పారు. మండలంలో మెట్టపాలెం గ్రామంలో శనివారం రాత్రి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. గ్రామంలో సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలన్నీ సంక్షేమం, అభివృద్ధిని పూర్తిగా విస్మరిస్తే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ 90 శాతానికిపైగా అమలు చేశారన్నారు. ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డేనని తెలిపారు. గత ప్రభుత్వాలు ఇటువంటి ఆలోచన చేశాయా అని ప్రశ్నించారు.

నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించినప్పుడు పథకాలపై, ప్రభుత్వ పరిపాలనపై నియోజకవర్గ ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. తిరిగి సీఎంగా జగన్‌మోహన్ రెడ్డే కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో పేదరికం తొలగించే విధంగా అమలు చేస్తున్న పథకాలపై విమర్శిస్తున్న ప్రతిపక్షాల నాయకులు అధికారంలోకి వస్తే ఈపథకాలు తీసేస్తామని చెప్పగలరా అని సవాల్ విసిరారు. అంతకుముందు ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను లబ్ధిదారులకు ఆయన అందజేసి, గ్రామంలో విద్యుత్‌దీపాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ మొల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ నేతలు మొల్లి నాయుడు, బి.రమణ, బి.శ్రీనివాస్, బుజ్జి పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిగ్రస్తురాలికి పీఎం సహాయ నిధి



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: మండలంలో కొత్తూరు పంచాయతీ రామాపురం గ్రామానికి చెందిన క్యాన్సర్ వ్యాధిగ్రస్తురాలు ఏడువాక సత్యవతికి పీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3 లక్షల చెక్కును ఎంపీ బి.వి.సత్యవతి తన కార్యాలయంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. ఈ చెక్కును అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో అందించి చికిత్స చేయించుకోవాలని సూచించారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణలో ఏఐఎస్ఎఫ్ నేతలు, విద్యార్థులు

అనకాపల్లిటౌన్: స్థానిక డీఎస్‌డీ, బీసీ వసతిగృహంలో శనివారం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఒమ్మి సతీష్ మాట్లాడుతూ 1936 ఆగస్టు 12న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందన్నారు. ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అంతకుముందు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు, నాయకులు శ్యాంశివ, రమ్య, శ్రీవాణి, లావణ్య, పావని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పీలా గోవింద సత్యనారాయణతో ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: మండలంలో తుమ్మపాల కొత్తపేట వీధిలో గల విఘ్నేశ్వరస్వామి ఆలయ 2వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. స్వామివారిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కర్రి బాబీ, ఆళ్ల రామచంద్రరావు, శందిన చినబాబు, ముత్తుర్తి మహేష్, పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ వేగవంతం చేయాలి



పి.ధర్మవరంలో పర్యటిస్తున్న నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి

ఎస్.రాయవరం : పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకుని ఉండాలని పాయకరావుపేట నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి అన్నారు. ఓటరు జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా శనివారం ఆమె పి.ధర్మవరం గ్రామంలో పర్యటించారు. సుమారు 20 గడపలు తిరిగి ఓటరు జాబితాలో పేర్లు పరిశీలించారు. కుటుంబంలో యువకులు పనుల నిమిత్తం దూరంగా వెళ్లిన వారి వివరాలు తెలుసుకుని పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలో అన్ని గ్రామాల్లోనూ ఓటరు జాబితా స్వచ్ఛీకరణ వేగవంతంగా చేయాలని బీఎల్‌వోలను ఆదేశించారు. ఆగస్టు 21 నాటికి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



కాలెపు తేజస్విని

కోటవురట్ల: మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న గాయత్రి హైస్కూలులో ఈ ఏడాది టెన్త్ చదివిన కాలెపు తేజస్విని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటకు చెందిన తేజస్విని ఎంపిక పట్ల కరస్పాండెంట్ బి. రాంకుమార్, ప్రిన్సిపాల్ వై.నగేష్, ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



తోటాడ హైస్కూల్‌లో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

మునగపాక : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆటల పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. కబడ్డీ, వాలీబాల్, లాంగ్‌జంప్, ఖోఖో వంటి ఆటలను ఆడిస్తున్నారు. ఎవరికి ఏ క్రీడపై ఆసక్తి ఉందో వాటిని ప్రోత్సహిస్తున్నారు. ఆగస్టు 15వ తేదీన విజేతలకు బహుమతులు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శరీర ధారుడ్యం పెరుగుతుందన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.

లైబ్రేరియన్లకు సన్మానం



శకుంతల, రమణలను సన్మానిస్తున్న లైబ్రేరియన్లు

రాంబిల్లి: దిమిలి శాఖా గ్రంథాలయంలో శనివారం లైబ్రేరియన్స్ డే ను ఘనంగా జరిపారు. అనకాపల్లి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న లైబ్రేరియన్లు దిమిలి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దిమిలి, మునగపాక గ్రంథాలయ అధికారులు ఎస్.శకుంతల, ఎల్.వి.రమణలను లైబ్రేరియన్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్ఎం శేఖరమంత్రి నర్సింగరావు(తాతాజీ), నూకినాయుడు, లైబ్రేరియన్లు ఆనంద్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో వైద్య శిబిరాలు

రాంబిల్లి : వాడనర్సాపురం, లోవపాలెం, వెంకయ్యపాలెం గ్రామాల్లో శనివారం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ గ్రామాల్లో విష జ్వరాలతో పలువురు బాధపడుతుండడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్‌కుమార్ ఆదేశాల మేరకు రాంబిల్లి పీహెచ్‌సీ డాక్టర్ అమృతసాయి వైద్య శిబిరాలను నిర్వహించారు.

అందరికీ నాణ్యమైన విద్య అందాలి



అధ్యాపకులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందాలని 'డైట్' కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ తెలిపారు. జాతీయ విద్యావిధానం, దాని ఫలితాలు ఆధారిత విద్యా విధానం అనే అంశంపై రెండు రోజుల పాటు స్థానిక 'డైట్' కళాశాలలో నిర్వహించిన సెమినార్ శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దాడి రత్నాకర్ మాట్లాడుతూ సెమినార్లు, వర్కుషాపులు, కాన్ఫరెన్సులు, ప్రయోజనకరమైన కార్యక్రమాలను నిర్వహించేందుకు చట్టబద్ధమైన సంస్థల సహకారం తీసుకున్నట్టు చెప్పారు. 21వ శతాబ్దపు నైపుణ్యాలపై దృష్టి సారించడం ద్వారా విద్యార్థులకు సంపూర్ణమై, సౌకర్యవంతమైన అభ్యాస అనుభవాన్ని అందించడం లక్ష్యమన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ చల్లా నరసింహం మాట్లాడుతూ నిర్దిష్ట లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని పాఠ్యాంశాలను బోధించాలని తెలిపారు. అనంతరం సెమినార్‌లో ప్రతిభకనబరిచిన అధ్యాపకులకు రత్నాకర్ ధ్రువీకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సకాలంలో గ్రామీణ రోగులకు వైద్య సేవలు

- డీఎంహెచ్‌వో హేమంత్



విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

అనకాపల్లి టౌన్: వివిధ రోగాలతో ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో ఎ.హేమంత్ ఆదేశించారు. మండలంలో శంకరంలో విలేజ్ హెల్త్ క్లినిక్(ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్) శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులను వారి స్వగృహాలకు వెళ్లి వైద్య సేవలందించాలని సూచించారు. వారికి సకాలంలో వైద్య సేవలు అందించినట్లయితే వ్యాధిని మొదటి దశలో నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో తుమ్మపాల సీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్ఎస్ షమీమ్, ఎంఎల్‌హెచ్‌పీ ఆర్.సత్యవతి, ఏఎన్ఎం ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం జగన్ రైతు పక్షపాతి



పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు, చిత్రంలో జాజుల రమేష్

అనకాపల్లిటౌన్: సీఎం జగన్‌మోహన్ రెడ్డి రైతుల పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు, 83వవార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్ అన్నారు. వార్డు పరిధిలో శిథిలావస్థలో ఉన్న చెర్లోపలి, బొడేద్దుల కాలువ, కచ్చళ్ల కాలువలను రైతులు, ఇరిగేషన్ అధికారులతో ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలువలకు చెందిన 8 షట్టర్ల మరమ్మతులకు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. ఇరిగేషన్ అధికారులు షట్టర్ల మరమ్మతులకు అంచనాలు తయారు చేశారు. అంచనా నివేదికను మంత్రి అమర్‌నాథ్‌కు సమర్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ మెకానికల్ జేఈ ఉమశ్రీ, జేఈ హనుమంత్, రైతులు పాల్గొన్నారు.

మిద్దె పంటలతో అధిక ఆదాయం





సదస్సులో మాట్లాడుతున్న రావూరి అనిత, సదస్సుకు హాజరైన ప్రజలు

అనకాపల్లిటౌన్: మిద్దెలు, మేడలపై పంటలు పండించడం ద్వారా అధిక ఆదాయం సమకూరుతుందని గాయత్రీ ఎకోప్రాడక్ట్స్ అధినేత రావూరి అనిత అన్నారు. గవరపాలెం వంశీఫంక్షన్ హాలులో గ్రీన్‌క్లబ్, రూఫ్‌గార్డెనర్స్ సంయుక్త ఆధ్వర్యంలో మేడలపై కూరగాయలు, తోటల పెంపకంపై శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పంటల సాగు ద్వారా అటు కాలుష్య నియంత్రణతోపాటు ఆదాయం సమకూరుతుందన్నారు. అంతకుముందు 60 రకాల టమాటా, 30 వంగ విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్, విజయనగరానికి చెందిన రైతునేస్తం అవార్డు గ్రహీత ఆదిలక్ష్మి, విశ్రాంతి అటవీశాఖ అధికారి బీరా వినోద్‌కుమార్, గార్డెనర్స్ సభ్యులు నీలవేణి, ఆశాలత పాల్గొన్నారు.

పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలి



ఉమ్మలాడలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి మురళీధర్

మునగపాక : ఐదేళ్ల లోపు పిల్లలకు టీకాలు వేయించే కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ మురళీధర్ కోరారు. ఉమ్మలాడ గ్రామంలో శనివారం ఆయన మిషన్ ఇంద్ర ధనస్సు టీకాల కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు సకాలంలో టీకాలు వేయించి వారిని వ్యాధుల నుంచి రక్షణ కల్పించాలన్నారు. అక్టోబర్ నెల వరకు మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఎంపీహెచ్ఈవో సుబ్బారావు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆహిన్ అంజుం, ఏఎన్ఎం మరియారత్నం, అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు కావేరి, వెంకటలక్ష్మి, వరలక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉపమాకలో వెయ్యిమందికి అన్నదానం



ఉపమాకలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

నక్కపల్లి : అధిక శ్రావణమాసం బహుళ ఏకాదశి శనివారం కావడంతో ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం స్వామివారికి నిత్యార్చనలు విశేష పూజలు నిర్వహించారు. భక్తులంతా స్వామివారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు సమర్పించుకున్నారు. అనంతరం దాతల విరాళాలతో స్వామివారి సన్నిధిలో సుమారు వెయ్యి మందికి అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశామని ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. నక్కపల్లి సీఐ అప్పన్న దంపతులు శనివారం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుకోవాలి



మునగపాక : ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుకోవాలని మండల పరిషత్ మాజీ అధ్యక్షులు దాసరి గౌరీలక్ష్మి అప్పారావు పిలుపునిచ్చారు. నాగవరం సచివాలయం వద్ద శనివారం జాతీయ జెండాలను ప్రదర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీన ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జెండా ఎగురవేసేలా చూడాలన్నారు. పోస్టాఫీస్‌లలో రూ.25కు జెండాలు విక్రయిస్తున్నారన్నారు. అలాగే స్వాతంత్ర్య సమర యోధులకు వందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.